బిజెపి విధానాలు ప్రజాస్వామ్యానికి ముప్పు

- రాష్ట్రాలను ఆధీనంలోకి తెచ్చుకునేందుకు మోడీ ప్లాన్
- ఒకే దేశం ఒకే ఎన్నికపై ప్రజా ఉద్యమం చేయాలి
- జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన సరికాదు
- దక్షిణాది రాష్ట్రాల ప్రజలు ఏకమవ్వాలి
- కేరళ మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో బిజెపి అనుసరిస్తున్న విధానాలతో ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు వాటిల్లుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 'ఒకే వ్యక్తి – ఒకే పార్టీ' అనేదే ప్రధానమంత్రి నరేంద్రమోడీ రహస్య అజెండా అనీ, దానికే ఆయన 'ఒకేదేశం–ఒకే ఎన్నిక' అని పేరు పెట్టుకున్నారని ఆయన చెప్పారు. వార్డు, సర్పంచ్ ఎన్నికలు మొదలు జడ్‌పిటిసి, ఎంపిటిసి, ఎమ్మెల్యే, ఎంపి ఎన్నికల వరకు మొత్తంగా ఆయన పెత్తనాన్నే కోరుకుంటున్నారని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి కూడా ప్రధాని మోడీ వస్తున్నారంటే దేశంలో రాజకీయ పరిస్థితులు ఏ దిశగా సాగుతున్నాయో అర్థమవుతున్నదని చెప్పారు. దేశంలో కుటుంబ నియంత్రణ పాటించాలని నిబంధన విధించింది కేంద్ర ప్రభుత్వమేననీ, దాన్ని సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాదిరాష్ట్రాలను ప్రశంసించాల్సింది పోయి, నియోజకవర్గాల పునర్విభజన పేరుతో ఓట్లు, సీట్లలో కోతలు ఎలా పెడతారని ప్రశ్నించారు. కేరళ రాజధాని తిరువనంతపురంలో మళయాళీ దినపత్రిక మాతృభూమి ఆధ్వర్యంలో ఆదివారం 'ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్' సదస్సు నిర్వహించారు. దీనిలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. సభికులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. తెలంగాణ రైజింగ్ నినాదం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష అని తెలిపారు. సమగ్ర కుల సర్వే, ఎస్సీ వర్గీకరణ అంశాలను ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, బిజెపి ప్రతి దాన్నీ తమ నియంత్రణలోకి తెచ్చుకోవాలని ప్రయత్నిస్తున్నారనీ, ఈ చర్యలు ప్రజాస్వామ్యానికి ముప్పు అని చెప్పారు. రాష్ట్రాల హక్కుల పరిరక్షణ కోసం దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరి ప్రజలు ఏకమవ్వాలని అభిలషించారు. ప్రజలే కేంద్రాన్ని ప్రశ్నించేలా పోరాట స్ఫూర్తిని రగిలించాల్సిన అవసరం ఏర్పడుతున్నదని తెలిపారు. దీనికోసం అవసరమైతే తాను చొరవ తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. బిజెపి విషయంలో విపక్ష పార్టీలకు ఒకే అభిప్రాయం ఉన్నా, కలిసి సాగలేకపోతున్నారనీ, దీనికి పరిష్కారం ఏమిటని సభికులు అడిగిన ప్రశ్నకు సీఎం రేవంత్ స్పందించారు. దానికోసమే ఇండియా కూటమి ఏర్పాటు చేశామనీ, అయితే అందరూ అన్నీ కోరుకోవడం వల్లే సమస్య ఏర్పడుతున్నదని విశ్లేషించారు. దీనికి ఢిల్లీ, హర్యానా ఎన్నికలను ఉదహరించారు. హర్యానాలో కేజ్రీవాల్ కాంగ్రెస్‌ను దెబ్బతీశారనీ, ఢిల్లీలో అది ఆయనకు ప్రతికూలమై, బిజెపి లాభపడిందని విశ్లేషించారు. నియోజకవర్గాల పునర్విభజనలో రాష్ట్రాల్లో ఇప్పుడున్న సీట్లకు అదనంగా 50 శాతం సీట్లు పెంచాలని తాను ప్రధాని మోడీని కోరానని చెప్పారు. అలాకాకుండా జనాభా ప్రాతిపదికన సీట్లునిర్ణయిస్తే, ఇప్పుడున్న సీట్లను కూడా దక్షిణాది రాష్ట్రాలు కోల్పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తరాది రాష్ట్రాల్లో పెరిగే సీట్లతోనే కేంద్రంలో అధికారంలోకి రావచ్చునీ, అప్పుడు దక్షిణాది అవసరం వారికి ఉండదనీ, ఇది పూర్తిగా ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తుందని విశ్లేషించారు. ఒకే దేశం–ఒకే ఎన్నికను కాంగ్రెస్‌పార్టీ అంగీకరించబోదని స్పష్టంచేశారు. ఈ ప్రక్రియ ద్వారా రాష్ట్రాలను స్థానిక సంస్థలుగా మార్చాలని ప్రధాని మోడీ ఆకాంక్షిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రాల హక్కుల్ని కేంద్రం లాగేసుకుంటున్నదనీ, సెంట్రల్ యూనివర్సిటీలు ఉన్నా, రాష్ట్ర యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్లను కూడా కేంద్రమే నియమిస్తామని ప్రతిపాదిస్తున్నదని చెప్పారు. నదుల అనుసంధానంలోనూ ఇదే విధానాన్ని కేంద్రం కొనసాగిస్తుందన్నారు. రాజ్యాంగంలో కేంద్ర జాబితా, రాష్ట్రాల జాబితా, ఉమ్మడి జాబితాలను నిర్ణయించారనీ, కానీ ప్రధాని మోడీ మాత్రం అంతా కేంద్రం చేతిలోనే ఉండాలనుకుంటున్నారని ఆక్షేపించారు. ప్రజలు, రాజకీయ పార్టీలు, మేధావులు దీనిపై ఆలోచన చేయాలని కోరారు. ఒకే దేశం–ఒకే ఎన్నిక వంటి విషయాలపై ప్రజా ఉద్యమాలు అవసరమని అభిప్రాయపడ్డారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కాంగ్రెస్ పార్టీ సరైన గౌరవం ఇవ్వలేదని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, అదంతా బిజెపి, నరేంద్ర మోడీ, వాట్సాప్ యూనివర్సిటీ సృష్టి అని కొట్టిపారేశారు. కాంగ్రెస్ పీవీ నర్సింహారావుకు గ్రామ సర్పంచ్ మొదలు రాష్ట్ర మంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి, ప్రధానమంత్రి, ఏఐసీసీ అధ్యక్షునిగా అనేక అవకాశాలు ఇచ్చిందని గుర్తుచేశారు. ఏఐసీసీ అధ్యక్షులుగా, కేంద్ర హోం మంత్రిగా పనిచేసిన సర్దార్ వల్లభాయ్‌పటేల్‌కు కూడా ఆర్‌ఎస్‌ఎస్ ముద్ర వేసి, తాము ఆయన వారసులం అని బిజెపి నేతలు ప్రచారం చేసుకుంటున్నారని చెప్పారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై స్పందిస్తూ, ఆ ఎన్నికలు పూర్తిగా ఒక జాతీయ పార్టీ, ఒక ప్రాంతీయ పార్టీ మధ్యే కేంద్రీకృతమైనాయన్నారు. ఇటీవలి కాలంలో ప్రజలు ప్రతిపక్షం, అధికారపక్షం వైపే మొగ్గుచూపుతున్నారనీ, మూడో పార్టీకి అవకాశం ఇవ్వట్లేదని విశ్లేషించారు. తెలంగాణ సహా అన్ని రాష్ట్రాల్లోనూ రెండు పార్టీల మధ్యే పోరు నడుస్తున్నదని చెప్పారు. గతంలో చట్టసభల్లో ఎక్కువ పార్టీలకు ప్రజలు అవకాశం ఇచ్చేవారనీ, తమ ఓటు వృథా కాకూడదని ప్రజలు భావిస్తున్నారని అభిప్రాయపడ్డారు. దానివల్లే ఎన్నికల పోరు రెండు పార్టీలకే పరిమితమవుతున్నదని తెలిపారు. నాయకత్వ లక్షణాలపై స్పందిస్తూ పార్టీ క్యాడర్‌ను స్థానిక నాయకత్వం జాతీయ నాయకత్వాన్ని స్ఫూర్తిగా చూపి, ప్రేరేపించడం వల్ల ఫలితాలు మెరుగ్గా ఉంటాయని వివరించారు. బిజెపి సర్పంచ్ ఎన్నికలు మొదలు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల వరకు ప్రధాని మోడీని గెలిపించమని కోరే వ్యూహాన్నే అనుసరిస్తున్నదని చెప్పారు. ఈ విషయంలో కాంగ్రెస్‌పార్టీ కొంత వెనుకబడి ఉన్నదని అంగీకరించారు. కార్యక్రమానికి మాతృభూమి సంపాదకులు మనోజ్ కె దాస్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

బీజాపూర్ ఎన్‌కౌంటర్ దుర్మార్గం

- సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌ఘఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ దుర్మార్గమైందని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అక్కడ నరమేధం యథేచ్ఛగా సాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం బీజాపూర్ ప్రాంతంలో జరిగిన ఘటనలో 31 మంది మావోయిస్టులు చనిపోయారనీ, ఇద్దరు జవాన్లు కూడా చనిపోయారని బస్తర్ రేంజ్ పోలీస్ అధికారులు ప్రకటించారని తెలిపారు. మృతుల సంఖ్య ఇంకా పెరగొచ్చని పోలీసు అధికారులు తెలిపినట్టు పేర్కొన్నారు. అందులో మావోయిస్టులు ఎందరో, ఆదివాసీ జనాలు ఎందరో వివరాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో విదేశీ శత్రువుల మీద యుద్ధం ప్రకటించినట్టుగా ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రభుత్వం బస్తర్ మీద, మావోయిస్టు ఉద్యమం మీద ప్రకటించటమేంటని ప్రశ్నించారు. 70 వేలమంది రకరకాల పారా మిలటరీ బలగాలతో, స్పెషల్ ఆపరేషన్ టీంతో అడవిని జల్లెడ పడుతోందని, ఆదివాసీ గిరిజన గ్రామాలను తగులబెడుతోందని, కోవర్టులను, ఆధునిక టెక్నాలజీనీ వాడుకుని విదేశీ భూభాగాన్ని ఆక్రమించుకున్నట్టు అబూజ్‌మడ్‌నీ ఆక్రమిస్తోందని తెలిపారు. నక్సలైట్ ఉద్యమం సమస్యను సాంఘిక, ఆర్థిక , రాజకీయ సమస్యగా కాకుండా అంతర్గత భద్రతా ప్రమాదంగా చిత్రించటం దుర్మార్గమన్నారు. మావోయిస్ట్ పార్టీ కూడా తాము యుద్ధం చేస్తున్నామనే, తమ భూభాగంలో విముక్తి ప్రాంతం ఏర్పడిందనే అతివాద అవగాహన నుంచి బయటపడాలని విజ్ఞప్తి చేశారు. ఆదివాసీ ప్రజల కోసం, వారి హక్కుల కోసం ప్రజాస్వామిక, ప్రజా ఉద్యమాలకు పూనుకోవాలని కోరారు.

తెలుగు భాషా సంపద రాయబారం పద్యాలు

ప్రజాశక్తి కల్చరల్

తెలుగు భాషా సంపద తిరుపతి వేంకట కవులు రచించిన కృష్ణ రాయబారం పద్యాలు అని బాల భవన్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ ఎం కె రాము అన్నారు త్యాగరాయ గానసభలోని కళా సంగీత నాట్య వేదిక పై డాక్టర్ కెవి రమణ జన్మదిన సందర్భంలో వల్లూరి శ్రీ హరి రావు భాస్కర రావు బృందం కృష్ణ రాయబారం లోని శయన దృశ్యం ప్రదర్శించారు. గాన సభ నత్య గురువు తులసి శిష్య బృందం కూచిపూడి నృత్య అంశాలు ప్రదర్శించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో డాక్టర్ రాము పాల్గొని మాట్లాడుతూ నృత్యం నాటకం రెండు కళా ప్రక్రియలు తెలుగు వారు మరచిపోలేని అనుభూతి ఇచ్చేవని తెలిపారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ గాన సభలో సంగీతంతో పాటు నాట్యం కూడా ఉచితంగా నేర్పుతున్నాము అని ఆసక్తి ఉన్న వారు చేర వచ్చునీ తెలిపారు.

నేటి సివిల్ సర్వీస్ అధికారులకు రమణాచారిఆదర్శం

- విద్యాసాగర్ రావు

ప్రజాశక్తి కల్చరల్

అధికార దుర్వినియోగం చేయకుండా పాలనా దక్షతతో తన బాధ్యతలు నిర్వహిస్తూ మానవీయ సంబంధాలుకు ప్రాధాన్యత ఇచ్చిన సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నత అధికారి డాక్టర్ కెవి రమణ నేటి ఐఎఎస్ అధికారులు ఆదర్శంగా తీసుకోవాలి అని మహారాష్ట్ర పూర్వ గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్ రావు అన్నారు. రాజకీయ నాయకులకు పావులుగా మారితే తదుపరి కాలంలో రాజకీయ నాయకులతో పాటు జైలుకి వెళ్లాల్సి వస్తుందని ఆయన తెలిపారు. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై వంశీ ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో డాక్టర్ కెవి రమణ జన్మదిన సందర్భంలో వంశీ రమణ గ్లోబల్ మ్యూజిక్ అవార్డ్ ప్రముఖ గాయకుడు స్వర కర్త రామాచారికి ప్రదానోత్సవం సభ జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న విద్యా సాగర్ రావు అవార్డును రామాచారికి బహుకరించి మాట్లాడారు. దేశ సమైక్యత సమగ్రత కోసం ఐఎఎస్, ఐపిఎస్‌లను నాటి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఏర్పరచారు అని రమణాచారి అందుకు తగిన విధం గా తన ధర్మాన్ని నిర్వర్తించేరు అని సర్దార్ బిరుదుకు అయన అర్హుడు అని చెప్పారు. రామాచారికి మ్యూజిక్ అవార్డ్ రమణాచారి పేరిట బహుకరించటం బంగారానికి సుగంధం అబ్బినట్లు వుందని అభివర్ణించారు. తెలుగు భాషలో సంస్కృతిలో భాగమైన సంగీతంలో నిగ్రహ శక్తి వుందని చెప్పారు. అధ్యక్షత వహించిన ప్రముఖ కవి డాక్టర్ ఎన్ గోపి మాట్లాడుతూ రమణాచారి ఏ పదవి లో వున్నా పదవికి వన్నె తెచ్చారని ప్రశంసించారు. రమణాచారి సభలకు వెలుగు అన్నారు రామా చారి డాక్టరేట్‌కి అర్హుడని సంగీత సేవకుడు అని పేర్కొన్నారు సాంస్కృతిక పోషకుడు బొల్లి నేని కృష్ణయ్య దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్న సభలో వంశీ రామరాజు స్వాగతం పలికారు. డాక్టర్ తెన్నేటి సుధా దేవి నివేదిక సమర్పించేరు. తొలుత రామాచారి శిష్య బృందం పాడిన పాటలు ఆకట్టుకున్నాయి.

యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పల్మనాలజీ సదస్సు విజయవంతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ పల్మనాలజీ సదస్సు విజయవంతమైంది. 'బ్రాంకస్–2025' అంతర్జాతీయ ఇంటర్వెన్షనల్ పల్మోనాలజీ సదస్సు లైవ్ వర్క్‌షాప్‌లో 60 మంది కంటే ఎక్కువ అంతర్జాతీయ అధ్యాపకులు, 150 మంది కంటే ఎక్కువ జాతీయ అధ్యాపకులు, 3 వేల కంటే ఎక్కువ మంది పల్మనాలజీ వైద్యులు హాజరయ్యారు. యశోద గ్రూప్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్ జి.యస్.రావు సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఊపిరితిత్తుల వైద్య విభాగం సరికొత్త ఆవిష్కరణలపై దృష్టిసారించేందుకు ఈ సమావేశం వేదికగా నిలిచిందని తెలిపారు. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా 1.8 మిలియన్ల మరణాలకు కారణమవుతున్న ఊపిరితిత్తుల క్యాన్సర్.. ఇతర క్యాన్సర్ మరణాలకంటే ఇది చాలా ఎక్కువ అని చెప్పారు. భారతదేశంలో అన్ని క్యాన్సర్ కేసులలో ఊపిరితిత్తుల క్యాన్సర్ దాదాపు 8.5 శాతం క్యాన్సర్ కేసులు ఉన్నాయాన్నారు. ఉబ్బస వ్యాధి నుంచి కరోనా వైరస్ వరకు అనేక ఊపిరితిత్తుల వ్యాధులకు ఉపశమనం కలిగించే బ్రాంకియాల్ థర్మో ప్లాస్టీ, ఇంటర్వెన్షనల్ బ్రాంకోస్కోపిక్ థర్మల్ వెపోర్ అబ్లేషన్‌లాంటి అత్యాధునిక వైద్య విధానాలను దక్షిణాదిలో తొలిసారిగా ప్రవేశపెట్టిన ఘనత యశోద హాస్పిటల్స్ వైద్యులకు దక్కిందని చెప్పారు. యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ.. యశోద ఆస్పత్రుల్లో అమలవుతున్న నూతన శిక్షణ పద్ధతులను వివరించారు. సదస్సు కార్యనిర్వహాక కార్యదర్శి డాక్టర్ హరికిషన్, ప్రముఖ వైద్యులు ప్రొఫెసర్ ఫెలిక్స్ హెర్త్ - థొరాక్స్ క్లినిక్ (జర్మనీ), ప్రొఫెసర్ కైల్ హోగార్త్ (యుఎస్ఎ), డాక్టర్ మైఖేల్ ప్రిట్చెట్ (యుఎస్ఎ), డాక్టర్ పల్లవ్ షా (లండన్), డాక్టర్ మునవ్వర్ (లండన్), డాక్టర్ లోరెంజో (ఇటలీ), డాక్టర్ జమాలుల్ (మలేషియా) సదస్సులో పాల్గొన్నారు.

యుజిసిని కీలుబొమ్మలా ఆడిస్తున్న కేంద్రం

- ప్రొఫెసర్ హరగోపాల్
- వర్సిటీల ప్రమాణాల్ని దిగజార్చే నిర్ణయాలు
- ఒయు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం
- ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) చట్టబద్ధమైన స్వతంత్ర సంస్థ అనీ, దాన్ని కేంద్రం తన సొంత ఎజెండా అమలుపరిచేందుకు కీలు బొమ్మలా ఆడిస్తోంది. వర్సిటీల ప్రమాణాల్ని దిగజార్చే నిర్ణయాలు చేస్తుందనీ, ఇది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం. యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేస్తూ తీసుకువచ్చిన యుజిసి నూతన మార్గదర్శకాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రొఫెసర్ హరగోపాల్, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అధ్యక్షతన 'యుజిసి 2025 నిబంధనలు–విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిపై దాడి' అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సులో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే విధంగా పాలన సాగిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయాలని సంస్కరణల పేరుతో కుట్రలు చేస్తూ విద్య కాషాయికరణకు పూనుకున్నారని ఆరోపించారు. యుజిసి 2025 సవరించిన నియమాలు వైస్ ఛాన్సలర్ల ఎంపికలో రాష్ట్ర గవర్నర్లకు ఎక్కువ అధికారాన్ని ఇస్తున్నదని, ఇది అత్యంత ప్రమాదకరమని తెలిపారు.

ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు విరాజ్ దేవాంగ్, జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగరాజ్, ఎఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షులు రామకష్ణ పాండ, జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ఎ స్టాలిన్ మాట్లాడుతూ యుజిసి ముసాయిదా ప్రతిపాదనలు ఉన్నత విద్యలో పూర్తిస్థాయి కార్పొరేట్ సంస్కృతిని చొప్పిస్తుందని విమర్శించారు. భారతదేశంలో విశ్వవిద్యాలయాల సైద్ధాంతిక నియంత్రణ కార్పొరేట్ శక్తులు లాభదయాక సాధనగా, హిందుత్వ ప్రచార సాధనలాగా మారకుండా ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. యుజిసి ముసాయిదా మార్గదర్శకాలు వ్యతిరేకంగా ఉద్యమించడానికి విద్యార్థులు సమయత్తం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఎఐఎస్ఎఫ్ జాతీయ ఆఫీస్ బేరర్స్ ఎన్.ఎ.స్టాలిన్, సంఘమిత్ర జెనా, కే.శివారెడ్డి, కబీర్, హమీమ్ హంజా, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల దుర్వినియోగానికే కేంద్ర ప్రభుత్వ చట్టానికి సవరణలు

- ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వక్ఫ్ చట్టం 1995 ను నిర్వీర్యం చేసి, ఖబ్రస్థాన్‌లను, దర్గాలను, మసీదు, అశూర్ ఖానాలను సులువుగా ఆక్రమించేందుకు అవకాశం కల్పించే విధంగా వక్ఫ్ చట్టానికి సవరణలు చేయాలని బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని ఆవాజ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వక్ఫ్ భూములను అక్రమార్కులకు కట్టబెట్టేందుకు బిజెపి పెడుతున్న సవరణను పార్లమెంటు తిరస్కరించాలని డిమాండ్ చేశారు. మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో వక్ఫ్ చట్టం సవరణ బిల్లును పార్లమెంట్ తిరస్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. దీనికి సూఫీ ఉలేమా కౌన్సిల్ అధ్యక్షులు ఖైరుద్దీన్ మౌలానా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ వక్ఫ్ చట్టం 1995 ప్రకారమే వక్ఫ్ బోర్డుకు చాలా పరిమితమైన అధికారాలు ఉన్నాయనీ, అరకొర అధికారుల వల్ల లక్షలాది ఎకరాల వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయనీ, రాష్ట్రంలో 77 వేల ఎకరాల వక్ఫ్ భూములుంటే అందులో 55వేల ఎకరాల వక్ఫ్ భూములు ఆక్రమణకు గురయ్యాయంటే వక్ఫ్ బోర్డుకు ఉన్న అధికారాలు ఎంత బలహీనంగా ఉన్నాయో అర్థమవుతుందని విమర్శించారు. అలాంటి చట్టాన్ని మరింత బలహీనపరిచేందుకు బిజెపి కుట్రలు చేస్తోందని ఆయన దుయ్యబట్టారు. వక్ఫ్ బోర్డుకు, దేవాదాయ బోర్డు తరహాలో జ్యూడిషియల్ అధికారాలు కూడా లేవని తెలిపారు. అయినా ఆ పార్టీ కావాలనే వక్ఫ్ బోర్డుకు అపరిమిత అధికారాలున్నాయని దుష్ప్రచారం చేస్తున్నదన్నారు. ఉన్న అరకొర అధికారాలను కూడా కుదించడానికి కుట్ర చేస్తున్నదని తెలిపారు. ఇది అత్యంత దుర్మార్గమని విమర్శించారు. వక్ఫ్ సమస్యల పరిష్కారం పేరుతో బిజెపి ఏకపక్షంగా వక్ఫ్ చట్టానికి తూట్లు పొడవడం అన్యాయమన్నారు. దీనిని ప్రజలు, ప్రజాస్వామికవాదులు నిరసించాలని కోరారు. ధర్నా కార్యక్రమంలో ఇనాయత్‌అలీ బాక్రి, నయీముల్లా షరీఫ్, ఇన్సఫ్ రాష్ట్ర కార్యదర్శి మునీర్ పటేల్, సనావుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

లోకల్ పాలి'ట్రిక్స్'

- స్థానిక ఎన్నికలపై పార్టీల దృష్టి
- 80 శాతం సీట్లే లక్ష్యంగా కాంగ్రెస్ అడుగులు
- రాష్ట్ర సర్కారు వైఫల్యాలపై బిఆర్ఎస్ ప్రచారం
- ఉత్తర తెలంగాణపై బిజెపి ఫోకస్
- పట్టున్న ప్రాంతాల్లో కమ్యూనిస్టుల పోటీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఏ పార్టీ అయినా భవిష్యత్తులో అధికారంలోకి రావాలన్నా...ఉన్న అధికారాన్ని నిలుపుకోవాలన్నా క్షేత్రస్థాయిలో బలం కీలకం. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయదుందుబి మోగించడానికి ఎన్ని ఎత్తుగడలున్నా..గెలుపునకు లోకల్ క్యాడరే కీలకమైనదన్నది అక్షరాల సత్యం. బేస్ కరెక్టుగా లేకుంటే బిల్డింగ్ కూలిపోవడం ఎంత నిజమో క్షేత్రస్థాయిలో పట్టులేని పార్టీ క్రమంగా దెబ్బతినటమూ అంతే నిజం. కాబట్టే, స్థానికం నుంచే క్యాడర్‌ను బలోపేతం చేసుకోవాలనే పట్టుదలలో పార్టీలున్నాయి. దానికి లోకల్ బాడీ ఎన్నికలనే అస్త్రంగా మార్చుకోవాలనే ఆలోచనలో పడ్డాయి. మార్చిలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయనే సంకేతాలు బలంగా వస్తున్న నేపథ్యంలో అన్ని పార్టీలూ ఆ దిశగా కసరత్తులు మొదలుపెట్టాయి. ఒక్కో సర్పంచి స్థానానికి రూ.30 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఖర్చుపెడుతున్న నేపథ్యంలో గ్రామంలో ఆర్థికంగా, సామాజికంగా బలమున్న నేతలపై అన్ని పార్టీలూ ఫోకస్ పెట్టాయి. ఆశావాహులకు ఇప్పటి నుంచే సర్దిచెబుతూ గెలుపు గుర్రాలపై దృష్టి సారించాయి.

బేసిక్‌గా, అభివృద్ధి పనులకు ఎక్కువ నిధులు వస్తాయనే కారణంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ బలపర్చిన అభ్యర్థులు ఎక్కువగా గెలిచే అవకాశముంది. దాన్ని అందిపుచ్చుకునే దిశగా కాంగ్రెస్ అడుగులు వేస్తున్నది. 80 శాతం సీట్లను గెలవడమే లక్ష్యంగా పెట్టుకున్నది. తమ పార్టీ బలపరిచే అభ్యర్థులను ఏకగ్రీవం చేసే బాధ్యతను ఎమ్మెల్యేలకు అప్పగించింది. అందుకోసం ఇటీవల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సిఎం రేవంత్‌రెడ్డి సమావేశాన్ని కూడా నిర్వహించిన విషయం విదితమే. అదే సమయంలో కులగణన సరిగా లేదనే విమర్శలు తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ రాజకీయ ఎదురుదాడిని మొదలుపెట్టింది. సర్పంచి ఎన్నికల్లో తమ పార్టీ బిసిలకు 42 శాతానికిపైగా సీట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందనీ, ఇతర పార్టీలు సిద్ధమా? అని అసెంబ్లీ సాక్షిగా సిఎం రేవంత్‌రెడ్డి సవాల్ కూడా విసిరారు. లోకల్ బాడీ ఎన్నికల్లో సిపిఐ కూడా కాంగ్రెస్‌తో కలిసి నడవనున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో చావుదెబ్బ తిన్న తర్వాత బీఆర్ఎస్‌కు స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కోవడం జీవన్మరణ సమస్యగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలు అమలు చేయడంలో విఫలమైందనే బలమైన వాదనను ప్రజల్లో తీసుకెళ్లడానికి బిఆర్ఎస్ శాయశక్తులా కృషి చేస్తోంది. సోషల్‌మీడియాను అస్త్రంగా వాడుకుంటు న్నది. మొన్నటి దెబ్బ నుంచి కోలుకోవాలంటే క్షేత్రస్థాయిలో పార్టీకున్న పునాదులను కాపాడుకుంటూ బలోపేతం చేసుకోవాల్సిన ఆవశ్యకతను బిఆర్ఎస్ గుర్తించింది. అయితే, ఆ పార్టీ నుంచి కెటిఆర్, హరీశ్‌రావు తప్ప మిగతా నాయకులు గమ్మునా ఉండటం ఆ పార్టీకి సమస్యగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెంటీల అమలులో వైఫల్యమే తమను స్థానిక పోరులో గట్టెక్కిస్తుందని కొండంత ఆశతో ఉంది.

బిజెపి కూడా తానేం తక్కువ కాదన్నట్టుగా చాపకింద నీరులా విస్తరించేందుకు లోలోపల పని చేసుకుంటూ పోతోంది. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో సాధించిన 35.19 శాతం ఓటు బ్యాంక్‌ను నిలబెట్టుకునేందుకు కసరత్తు చేస్తోంది. ఇప్పటికే సన్నాహక సమావేశాలు నిర్వహించి మొన్నటి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు సాధించిన ఉత్తర తెలంగాణపై పట్టు సడలిపోకుండా ఎలా చూసుకోవాలనే దానిపైనే ప్రధాన ఫోకస్ పెట్టింది. ఓ వైపు హిందూత్వనే ప్రధాన అస్త్రంగా వాడుకుంటూనే పాటు భవిష్యత్ అవసరాల రీత్యా ఈ ఎన్నికల్లో యువతకు ఎక్కువ సీట్లు ఇచ్చేలా ఇప్పటి నుంచే అన్వేషణ మొదలుపెట్టింది. వార్డుల వారీగా వాట్సాప్ గ్రూపులు పెట్టి..ఆ వార్డుల్లో ప్రభావితం చేసే కుటుంబాలపై దృష్టి సారించి బలపడేందుకు ఆర్ఎస్ఎస్ స్కెచ్ వేసి ముందుకెళ్తోంది.

బలమున్న ప్రాంతాలపై సిపిఎం దృష్టి

బలమున్న ప్రాంతాల్లో సొంతంగా పోటీచేయనున్నట్టు, అదే సమయంలో సిపిఐ, ఇతర వామపక్షాలు బలంగా ఉన్న చోట్ల సర్దుబాటు చేసుకుని ముందుకెళ్లనున్నట్టు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రకటించిన విషయం విదితమే. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలతో పాటు ఇతర జిల్లాల్లోని పలు గ్రామాలకు విస్తరించడంపై ఆ పార్టీ దృష్టి సారించింది. అయితే, డబ్బులతో రాజకీయాలు నడుస్తున్న ఈ కాలంలో అందుకు భిన్నమైన విధానాలతో ప్రజల్లోకి చొచ్చుకెళ్లేందుకు తన శక్తికి మించి ప్రయత్నాలు చేస్తున్నది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడటమే కర్తవ్యంగా ముందుకు సాగుతోంది. ఓట్లు, సీట్లు పొందడమే ప్రాధాన్యం కాకుండా వీలైనంత మేరకు కొత్త ప్రాంతాలకు, ప్రజల్లోకి పార్టీని తీసుకెళ్లేందుకు రాష్ట్ర నాయకత్వం సన్నద్ధమవుతోంది.

సన్నపు వడ్ల బోనస్ వెంటనే చెల్లించాలి

- పండిన కందులను షరతులు లేకుండా కొనుగోలు చేయాలి
- సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి : హరీశ్ రావు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

48 గంటల్లో కొనుగోలు చేసిన వడ్లకు డబ్బులు ఇస్తున్నామని బోగస్ మాటలు మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి.. చేతలు మాత్రం చేదుగా ఉన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా సన్నపు వడ్ల కొనుగోలుకు రావలసిన రూ 432 కోట్ల బోనస్‌ను వెంటనే రైతుల అకౌంట్‌లో జమ చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. సిద్దిపేట పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బోనస్ డబ్బులు చెల్లించాలని, ఇతర సమస్యలపై సిఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసినట్టు తెలిపారు. అన్ని పంటలకు బోనస్ అన్న మాట బోగస్ అయిందని, సన్న వడ్లకు బోనస్ బోగస్, రైతు భరోసా బోగస్, పంటల బీమా బోగస్ అని అన్నారు. ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఉత్తర కుమారుని మాటలు మాట్లాడుతున్నారని, రైతులకు క్షమాపణ చెప్పాలని, పాలాభిషేకాలు ఎందుకని ప్రశ్నించారు. గట్ల మల్యాలకు చెందిన రైతులు ఆదివారం ఉదయం తనను కలిసి బోనస్ డబ్బులు పడలేదని చెప్పడంతో తన నియోజకవర్గమే కాదు, రాష్ట్రవ్యాప్తంగా సన్నపు వడ్లకు బోనస్ పడలేదన్న విషయం తెలిసిందని తెలిపారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లోకి వెళ్తే రైతులు, ప్రజలే అభిషేకాలు చేస్తారని ఎద్దేవా చేశారు. అలాగే, రైతులు పండించిన కందులను ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయడానికి సిఎం అనుమతివ్వాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సిద్దిపేటలో కందుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారని, కానీ ప్రభుత్వం ఎకరాకు మూడు క్వింటాలు మాత్రమే కొనుగోలు చేస్తానని చెప్పడం రైతులను ఇబ్బందులకు గురి చేయడమేనన్నారు. ఎకరాకు ఆరు నుంచి పది క్వింటాళ్ల వరకు కందులు పండుతాయన్నారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో కందులకు రూ 400 బోనస్ అని చెప్పిందని, మద్దతు ధర రూ 7500 ఉందని, బోనస్‌తో కలుపుకొని రూ 7900కి కందులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికారులు రైతుల పంటలను ఆన్‌లైన్ పొందుపరచకపోవడంతో కొంతమందివి మిస్ అయ్యాయని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా రైతు అని, ఈ విషయంపై ఆయన స్పందన లేదని ఆరోపించారు. సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించకపోవడంతో రైతులు తక్కువ ధరకే బయట అమ్ముకుంటున్నారని, వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరారు.

బిఆర్ఎస్‌ది జగమంత..కాంగ్రెస్‌ది సగమంత

ఆర్ఎస్‌ది జగమంత పాలన అయితే.. కాంగ్రెస్‌ది సగమంత పాలన అని హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ తాను తవ్వుకున్న గ్యారంటీల గోతిలో తానే సమాధి అవుతుందని తెలిపారు. ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి, కోతలు కోసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు రైతు బంధు ఇవ్వడంలో కోతలు, రెండవ దశ గొర్రెల పంపిణీలో కోతలు, మత్స్యకారులకు చేపల పంపిణీలో కోతలు, కందుల కొనుగోళ్లలో కోతలు, బోనస్ కోతలు అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్లకు చెందిన రైతు కనకవ్వకు 31 గుంటల భూమి ఉంటే రైతుబంధు రూ 4650 రావాల్సి ఉండగా రూ 1650 మాత్రమే పడిందని అన్నారు. 6 గ్యారంటీలు అని చెప్పి అర గ్యారెంటీలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, నాయకులు రాజనర్సు, వేణుగోపాల్ రెడ్డి, సంపత్ రెడ్డి, సుందర్, రవీందర్, గుండు భూపేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ వైఖరిని ఖండించండి

- అక్రమ వలసదారుల పేరుతో భారతీయుల కాళ్లకు, చేతులకు సంకెళ్లు వేయడం దారుణం : బి వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అక్రమ వలసదారుల పేరుతో భారతీయుల కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి ఇండియాకు పంపించి అవమానించిన అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ వైఖరిని ఖండించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి వెంకట్ అన్నారు. భారతీయ వలసదారుల పట్ల అమెరికా అధ్యక్షులు వ్యవహరిస్తున్న అమానుష వైఖరిని ఖండిస్తూ ఆదివారం హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్ రోడ్డులో సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిటీ కార్యదర్శి ఎం. వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సభలో బి.వెంకట్ మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షులు ట్రంప్ వ్యవహరిస్తున్న వైఖరి అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధమని అన్నారు. అక్రమ వలసదారుల పేరుతో భారతీయుల కాళ్లకు, చేతులకు సంకెళ్లు వేసి సైనిక విమానంలో కుక్కి పంజాబ్‌లోని అమృత్‌సర్ విమానాశ్రయంలో ఫిబ్రవరి 5న 104 మందిని పంపించారని తెలిపారు. భారతీయుల పట్ల వ్యవహరించిన వైఖరి యుద్ధ ఖైదీల పట్ల కూడా ఉండదని అన్నారు. అమెరికాలో అక్రమ వలసదారులు ఉంటే ఐక్యరాజ్యసమితితో పాటు ఏ దేశాల నుంచి వలసదారులు వచ్చారో ఆయా దేశాలకు సమాచారం ఇచ్చి గౌరవంగా వారిని పంపించాల్సి ఉందని చెప్పారు. కానీ ట్రంప్ భారతీయుల పట్ల ఈ రకంగా వ్యవహరిస్తున్నా భారత ప్రధాని కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. పార్లమెంట్‌లో భారత విదేశాంగ మంత్రి జయశంకర్ అమెరికా వైఖరికి వత్తాసు పలికి 140 కోట్ల మంది భారతీయుల ఆత్మగౌరవాన్ని కించపరిచారని అన్నారు.

నిరసన తెలుపుతున్న బి వెంకట్, గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ నాయకులు

దేశంలో నిరుద్యోగం పెరగడం వల్ల ఉద్యోగాలు లేక పేదలు ట్రావెల్ ఏజెంట్ల మాయలో పడి లక్షలు ఖర్చుచేసి అమెరికా వెళ్ళి ఇలాంటి పరిస్థితి తెచ్చుకున్నారని తెలిపారు. దేశంలో నిరుద్యోగం పెరగడానికి కారణం బిజెపి అనుసరిస్తున్న విధానాలే కారణమని అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్ మాట్లాడుతూ.. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడి జలియన్ వాలాబాగ్‌లో అనేకమంది అమరులైన పోరాటాల గడ్డ పంజాబ్‌లోని అమృత్‌సర్ పట్టణంలో ఒక విదేశీ (అమెరికా) సైనిక విమానం దిగడం భారత సార్వభౌమత్వానికి మాయని మచ్చ అని అన్నారు. భారతీయ అక్రమ వలసదారులు అమెరికాలో ఉంటే మన దేశం నుంచి విమానం పంపించి సగౌరవంగా తీసుకురావాలని తెలిపారు. ఐదు కోట్ల మంది జనాభా ఉన్న కొలంబియా, అమెరికా పక్కనే ఉన్న మెక్సికో, ఇతర చిన్న దేశాలు అమెరికా అధ్యక్షులు ట్రంప్ వైఖరిని వ్యతిరేకించాయని తెలిపారు. కనీసం ఆ దేశాలకున్న ధైర్యం మన భారత ప్రభుత్వానికి, ప్రధాని మోడీకి లేదని అన్నారు. పొద్దున లేస్తే హిందువుల జపం చేసే బిజెపి..పేద హిందువులకు సంకెళ్లు వేసినా పట్టించుకోరా అని ప్రశ్నించారు. బిజెపి దృష్టిలో హిందువులు అంటే కేవలం అదానీ, అంబానీ వంటి సంపన్నులేనా అని అన్నారు. ఇకనైనా భారత ప్రభుత్వం అనాగరికమైన డోనాల్డ్ ట్రంప్ చర్యలను ఖండించాలని, భారతీయులను సగౌరవంగా భారతదేశానికి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం శ్రీనివాస్, నగర కమిటీ సభ్యులు కుమారస్వామి, ఎం అజయ్ బాబు, జి నరేష్, కె అజయ్ బాబు, సి మల్లేష్, జి కిరణ్, అశోక్ రెడ్డి, పి విమల, ఎండి జావేద్, టి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

తునికాకు సేకరణ పనులు చేపట్టి టెండర్లు పూర్తి చేయాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తునికాకు సేకరణ పనులను చేపట్టి, తక్షణమే టెండర్లు పూర్తి చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజనులు, గిరిజనేతర పేదలకు ఉపాధిని కల్పిస్తున్న తునికాకు సేకరణ పనులను ప్రతి ఏడాది జనవరి నాటికే టెండర్ల ప్రక్రియను అటవీశాఖ పూర్తిచేస్తుందని గుర్తు చేశారు. కానీ ఈ ఏడాది ఎందుకు తాత్సారం చేసిందని ప్రశ్నించారు. టెండర్ల పనులు పూర్తికానందున ఆదివాసీలు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం టెండర్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 14 జిల్లాల్లో తునికాకు సేకరణను అటవీశాఖ చేపడుతుందని తెలిపారు. దాదాపు పది లక్షల మంది దీనిపై ఆధారపడి లబ్ధిపొందుతున్నారని పేర్కొన్నారు. లోడింగ్, అన్‌లోడింగ్ తదితర పనులతో పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. ప్రతి ఏటా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత ఫిబ్రవరిలో ఫ్రూనింగ్ చేస్తారని పేర్కొన్నారు. ఫలితంగా ఎక్కువగా దిగుబడి వస్తుందని తెలిపారు. కానీ ఈ పని సకాలంలో జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ స్పందించటంలో నిర్లక్ష్యముందని విమర్శించారు. ఈ సీజన్‌ద్వారా వచ్చే ఆదాయంలో గిరిజనులు అనేక ఆర్థిక కార్యకలాపాలను, శుభకార్యాలను నిర్ణయించుకుంటారని తెలిపారు. జాప్యం జరుగుతున్నందువల్ల గిరిజనులు ఆందోళన చెందుతున్నారని, ఏజెన్సీ ప్రాంతాల్లో తునికాకు దొరికే ఏరియాల్లో కార్మికులు, గిరిజనులు ఉపాధి కోల్పోకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. టెండర్లు నిర్వహించకపోతే అటవీశాఖ ద్వారానైనా సేకరించటానికి తగిన ఆదేశాలివ్వాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు.

కాటేదాన్ ప్లాస్టిక్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం

- రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలోని ఓ ప్లాస్టిక్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు, కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటేదాన్‌లోని ప్లాస్టిక్ పరిశ్రమలో మధ్యాహ్నం కార్మికులు పనిచేస్తుండగా ఒకవైపు నుంచి ప్లాస్టిక్‌కు మంటలు అంటుకున్నాయి. క్షణాల్లో కంపెనీ మొత్తం మంటలు వ్యాపించాయి. వెంటనే కార్మికులు భయంతో బయటకు పరుగులు తీశారు. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది సుమారు రెండు గంటలు కష్టపడి రెండు ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. సకాలంలో ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పి వేయడంతో పక్కనే ఉన్న పరిశ్రమలకు మంటలు వ్యాపించకుండా తగిన చర్యలు తీసుకున్నారు. దాంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో ఆస్తి నష్టం వాటిల్లింది. అయితే ఈ ఘటనకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమా.. లేదా మరే ఇతర కారణాలు ఉన్నాయా అన్న కోణంలో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో రియల్ ఎస్టేట్ విధ్వంసం

- మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ఏడాది పాలనలో రాష్ట్రంలో రియల్‌ఎస్టేట్ రంగం విధ్వంసమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. రైతన్నలు, నేతన్నలు, ఆటో డ్రైవర్లతో మొదలైన ఆత్మహత్యల పరంపర రియల్ ఎస్టేట్ రంగానికి చేరడం ఆందోళన కలిగిస్తుందని వ్యాఖ్యానించారు. మొన్న కొంపల్లిలో వేణుగోపాల్ రెడ్డి, నేడు ఆదిభట్లలో నరసింహగౌడ్ ఆత్మహత్యలు ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో రియల్ రంగం తెలంగాణ గ్రోత్ ఇంజిన్ అయిన హైదరాబాద్ అభివృద్ధిని కాంగ్రెస్ సర్కార్ కాలరాసిందని ఆరోపించారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నా, రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి దిశలో వెళ్తుందంటూ తప్పుడు ప్రకటనలుల ఇస్తున్నారని విమర్శించారు. "హైదరాబాద్ బాగుంటేనే, తెలంగాణ బాగుటుంది. హైడ్రా, మూసి, ఫార్మా సిటీ, మెట్రో లైన్ మార్పు తదితర అనాలోచిత నిర్ణయాలు ఈ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టాయి. ఇప్పటికైనా నష్ట నివారణకు చర్యలు చేపట్టండి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆత్మహత్యకు పాల్పడిన నరసింహగౌడ్ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



14 ఎకరాల్లో చెరకు తోట దగ్ధం

- సంగారెడ్డి జిల్లా పెద్దారెడ్డిపేటలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేతికొచ్చిన చెరకు పంటలో ఒక్కసారిగా మంటలు చెలరేగి.. పంట మొత్తం దగ్ధమైంది. ఓ పక్క సోమవారం నుంచి పంట కోత చేపట్టాలని కూలీల వద్దకు రైతు వెళ్లగా.. మరోపక్క పంటలో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమయ్యింది. దాంతో ఆ రైతు కన్నీటిపర్యంతమయ్యాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల పరిధిలోని పెద్దారెడ్డిపేట గ్రామంలో ఆదివారం జరిగింది. బాధిత రైతు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి లింగయ్య ముద్దాయిపేట గ్రామ శివారులోని తన 14 ఎకరాల సొంత భూమిలో చెరకు పంటను సాగు చేశాడు. పంట కోతకు వచ్చినా.. లేబర్ కొరత కారణంగా ఆలస్యమైంది. అయితే నేటి నుంచి పంటను కోయడానికి లేబర్‌తో ఒప్పందం చేసుకుని ఎడుపాయల వనదుర్గ మాత దర్శనానికి ఆదివారం వెళ్ళాడు. కాగా అంతలోనే చెరకు పంటలో మంటలు చెలరేగాయి. ఈ విషయం తెలియగానే జోగిపేట ఫైర్ స్టేషన్‌కు బాధిత రైతు సమాచారం అందించాడు. ఫైర్ ఇంజన్ సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడానికి ప్రయత్నాలు చేసినా అదుపు కాలేదు. దాంతో దాదాపు రూ.8 లక్షల నష్టం వాటిల్లిందని రైతు లింగయ్య వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేకాట స్థావరాలపై పోలీసులు దాడి జరిపి రూ.4లక్షల పైగా నగదును స్వాధీనం చేసుకొని 16 మందిపై కేసు నమోదు చేసిన ఘటన సంగారెడ్డి జిల్లా వటపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మర్వెళ్లి గ్రామ శివారులో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు కేంద్రంగా ఆర్గనైజింగ్ టీమ్ అడ్వైజర్ ఆధ్వర్యంలో చాలా ప్రాంతాల్లో పేకాటను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మర్వెళ్లి గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తున్నా రనే సమాచారంతో.. సంగారెడ్డి జిల్లా ఎస్‌పి రూపేష్ ఆదేశాలతో ఇద్దరు డిఎస్‌పిలు, సిఐలు, వటపల్లి పోలీసులు పేకాట స్థావరంపై దాడులు జరిపారు. పేకాట ఆడుతున్న 16 మందిని పట్టుకుని వారిపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.4,07,855 నగదుతో పాటు, ఒక జైలో, ఒక బుల్లెట్ వాహనం, 15 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆర్గనైజింగ్ టీమ్ లీడర్ తప్పించుకొని పారిపోయినట్టు పోలీసులు తెలిపారు. అతన్ని కూడా త్వరలో పట్టుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వటపల్లి పిఎస్ నుంచి ఏఎస్‌ఐ విటల్, రైటర్ ప్రతాప్ పాల్గొన్నారు.

కాళేశ్వరం ఆలయంలో ఘనంగా కుంభాభిషేకం

- మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంలో మహా కుంభాభిషేక మహోత్సవ మహా ఘట్టం ఆదివారం ఘనంగా జరిగింది. 42 ఏళ్ల తర్వాత జరిగిన మహా కుంభాభిషేక మహాక్రతువు ఆదివారం ముగిసింది. గంగా, యమున, సరస్వతి సంగమమైన ప్రయాగరాజ్‌లో మహాకుంభమేళ జరుగుతున్న తరుణంలోనే కాళేశ్వరం త్రివేణి సంగమంలో మహాకుంభాభిషేక ఘట్టం ఆవిష్కృతమైంది. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు మూడ్రోజుల పాటు జరిగిన క్రతువులో ఆదివారం చివరిరోజు ఉదయం 10.42 గంటలకు కుంభాభిషేక మహోత్సవ ఘట్టంలో వేద పండితులు, శృంగేరి పీఠానికి చెందిన తపోవన పీఠాధిపతి శ్రీ సచ్చిదానంద సరస్వతి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్‌పి కిరణ్ ఖరే, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్.. వేరువేరుగా ఆలయానికి రాగా రాజగోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అక్కడినుంచి హోమశాలకు వచ్చి పూజలు చేశారు. కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయంలో విశేష పూజలు చేశారు.

హోమంలో పాల్గొన్న మంత్రులు

కాళేశ్వరం క్షేత్ర అభివృద్ధికి మాస్టర్ ప్రణాళిక : మంత్రి శ్రీధర్‌బాబు

కాళేశ్వరం క్షేత్రంను మాస్టర్ ప్రణాళికతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందించి నిధులు మంజూరు చేస్తున్నట్టు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఆదివారం మహా కుంభాభిషేకం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉత్తర భారతంలోని కాశీ, కేదార్‌నాథ్‌లోని శివుని క్షేత్రాల కంటే కాళేశ్వరం క్షేత్రం పాశస్త్యం కలదిగా పురాణాలు చెబుతున్నాయని తెలిపారు. గోదావరి, ప్రాణహిత నదుల సంగమంతో త్రివేణి సంగమంగా ప్రసిద్ధి చెందడంతో పాటు అంతర్వాహినిగా సరస్వతి నది వెలసిందన్నారు. మే 15వ తేదీ నుంచి సరస్వతి నది పుష్కరాలు 12 రోజుల పాటు నిర్వహించేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. కాళేశ్వర క్షేత్రంలో అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు అభివృద్ధి చేసేందుకు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాల సహాయం తీసుకుంటామని చెప్పారు. మూడు రాష్ట్రాలకు కూడలిగా ఉన్న కాళేశ్వరానికి ప్రతిరోజూ భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారని, పుష్కరాలకు లక్షల సంఖ్యలో యాత్రికులు వచ్చి పుణ్యస్నానాలు ఆచరిస్తారని భావిస్తున్నట్టు తెలిపారు. కాళేశ్వరం అభివృద్ధికి రూ.25 కోట్లు వివిధ శాఖల ద్వారా మంజూరు చేసినట్టు, అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని అన్నారు.

కాంగ్రెస్ కులగణన తప్పుల తడక

- బిసిల జనాభాను కావాలనే తగ్గించారు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారికి క్షమాపణ చెప్పాలి
- నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన తప్పుల తడకని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ఆ పార్టీ బిసి నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కులగణన శాస్త్రీయంగా జరగలేదని ఆరోపించారు. ఎన్నికల ముందిస్తామన్న 42 శాతం రిజర్వేషన్ హమీని తుంగలో తొక్కేందుకే బిసిల జనాభాను తక్కువగా చూపించి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని వ్యాఖ్యానించారు. ఈ అంశంపై తమ పార్టీ శాసనసభ, శాసనమండలిలో నిరసన తెలిపిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బేషజాలకు పోకుండా వెంటనే రీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు. "కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో బలహీన వర్గాలు ఆందోళనలతో ఉన్నారు. రేషన్ కార్డుల జారీ, ఇళ్ల కేటాయింపులు, ఆరు గ్యారంటీలు తదితర ప్రభుత్వ పథకాల్లో తమ వాటా తగ్గుతుందేమోనని వారు భయపడుతున్నారు.

బిసి డిక్లరేషన్ పేరిట కామారెడ్డి సభలో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున వాగ్దానాలు చేసింది. 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని హమీ ఇచ్చింది. బిసిలకు రూ. లక్ష కోట్ల బడ్జెట్ పెడతామనీ, సబ్ ప్లాన్ తీసుకొస్తామని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో కాంగ్రెస్ పార్టీ చెప్పించింది. ఏడాది గడిచినా బిసి డిక్లరేషన్ కోసం నయా పైసా కేటాయించలేదు. కొత్తగా బిసి కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, ఒక్కో కార్పొరేషన్ రూ.50 కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని చేసిన వాగ్దానం అమలుకు నోచుకోలేదు. 22 లక్షల మందిని బిసి జాబితా నుంచి తొలగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారికి క్షమాపణ చెప్పాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో బిసి బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తామని ఇచ్చిన మాటను సైతం కాంగ్రెస్ నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఉల్టా చోర్ కోత్వాల్‌కు డాంటే అన్నట్టు బిఆర్‌ఎస్‌ను విమర్శించడం ఆ పార్టీకే చెల్లిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. శాసనసభ ఎన్నికల్లో 34 సీట్లు బిసిలకు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ కేవలం 19 సీట్లు మాత్రమే ఇచ్చిందని, అసెంబ్లీ, పార్లమెంటుతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతానికి పైగా బిఆర్‌ఎస్ బిసిలకు సీట్లిచ్చిందని గుర్తు చేశారు. బిసిలకు కాంగ్రెస్ చేసిన అన్యాయంపై నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్టు కెటిఆర్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ బిసి నేతలు మదుసూదనాచారి, తలసాని శ్రీనివాసయదవ్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌కు ఎమ్మెల్సీ అభ్యర్థులు కరువు

- కేంద్ర మంత్రి బండి సంజయ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికార పార్టీ కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు అభ్యర్థులు కరువయ్యారని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో ఆదివారం వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్ అనంతరం ఆదివారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థితో కలిసి బండి సంజయ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బలమైన అభ్యర్థులతో గెలవబోతున్నామని, తమ పార్టీ నుంచి అభ్యర్థులను ముందే ప్రకటించామని తెలిపారు. బిఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరిందని, జైలుకు పంపకపోవడం, కేసులు మూసివేయడంపై ఎమ్మెల్సీ ఎన్నికల్లో సహకరించేలా ఇరు పార్టీలు ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. అందుకే కాళేశ్వరం, ఫోన్‌ట్యాపింగ్, ఫార్ములా రేస్ వంటి కేసులే ఇందుకు నిదర్శనమన్నారు. నిరుద్యోగ భృతి, ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేసిన కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యార్థులకు రూ.8వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్స్ రావాలని, యాజమాన్యాలన్నీ కాంగ్రెస్‌పై కోపంతో ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ విరమణ చేసిన 8వేల మందికి రిటైర్డు బెనిఫిట్స్ రూ.20వేల కోట్లు బకాయిలు ఉన్నాయని, వాటిని ఎగ్గొట్టేందుకు విరమణ వయస్సు 64ఏండ్లు చేస్తామని చెప్తున్నారని తెలిపారు. 317 జిఒతో అనారోగ్య మరణాలు, ఆత్మహత్యలు జరిగితే పోరాటం చేసింది మేమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి పేర్లు మారిస్తే పేదలకు ఇళ్లు ఎలా ఇవ్వాలో తాము ఆలోచన చేస్తామన్నారు. గత ప్రభుత్వం కేంద్రానికి పేరు రావొద్దనే ఉద్దేశంతో పదేండ్లలో కెసిఆర్ ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. సమగ్ర కుటుంబ సర్వే కూడా తప్పుల తడకగా చేసి బిసిలను తక్కువ చేసి చూపించిందన్నారు. ప్రజల తరపున పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని, అందుకే మూడు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ బీజెపి బలపరిచిన అభ్యర్థులనే గెలిపించాలని కోరారు.

ఫోన్ ఇవ్వలేదని ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్టడీ మెటీరియల్ కోసం సెల్ ఫోన్ ఇవ్వలేదని మనస్తాపానికి చెందిన పదవ తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బొమ్మకంటి స్ఫూర్తి (16) ఓ ప్రయివేట్ పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. శనివారం మధ్యాహ్నం కాగజ్‌నగర్‌లోని ఫాతిమా పాఠశాలలో నవోదయ పరీక్షరాసి తిరిగి ఇంటికి వచ్చింది. అనంతరం మండల కేంద్రంలోని ప్రయివేట్ పాఠశాలకు వెళ్లి తిరిగి ఏడున్నర గంటలకు స్ఫూర్తి తండ్రి సదానందంతో ఇంటికి వచ్చింది. కూతురిని ఇంట్లో వదిలి అతను బయటికి వెళ్లాడు. స్టడీ మెటీరియల్ ఫోన్‌లో పిడిఎఫ్ ఉందని ఫోన్ ఇవ్వాలని అమ్మ రామదేవిని అడిగింది. ఫోన్ ఇస్తే గేమ్స్ ఆడి సమయం వృథా చేస్తావని నీకు కావాల్సిన మెటీరియల్ జిరాక్స్ కాపీ తీసుకువస్తానని రామదేవి జిరాక్స్ సెంటర్‌కి వెళ్లింది. దాంతో మనస్తాపానికి గురైన స్ఫూర్తి ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి చీరెతో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. జిరాక్స్‌తో తల్లి ఇంటికి వచ్చే సరికి ఫ్యాన్‌కు ఉరేసుకున్న బిడ్డను చూసి వెంటనే తండ్రి సదానందంకి కాల్ చేసింది. అతను వచ్చి స్ఫూర్తిని కిందకు దింపి వెంటనే కౌటాల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకి తీసుకెళ్లారు. అక్కడ నుంచి సిర్పూర్-టి ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్లతో హల్‌చల్

- గుర్తు తెలియని వ్యక్తుల నిర్వాకం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుర్తు తెలియని వ్యక్తులు ఒఆర్‌ఆర్‌పై ఆదివారం తెల్లవారుజామున రెండు కార్లతో హల్ చల్ చేసిన ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఔటర్ రింగ్ రోడ్డుపై పెట్రోలింగ్ వాహనం డ్రైవర్ రాజు, అతని సహాయకుడు మణిరాజ్‌తో కలిసి ఆదివారం తెల్లవారుజామున మూడు గంటలకు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో శంషాబాద్ - గోల్కొండ మధ్య ఆర్‌హెచ్‌ఎస్ -136 కెఎం వద్ద ఒఆర్‌ఆర్ రోడ్డుపై ఇద్దరు గుర్తు తెలియని కార్ల డ్రైవర్లు తమ కార్లతో విన్యాసాలు చేశారు. ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వారు కార్లను నిర్లక్ష్యంగా నడిపారు. పెట్రోలింగ్ సిబ్బంది కరిగుల శ్రీరామ్‌గౌడ్ తదితరులు ఘటనా స్థలానికివచ్చేసరికి ఆ కార్ల డ్రైవర్లు తమ కార్లతో అక్కడి నుంచి పారిపోయారు. దాంతో వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు పాల్పడిన వారి కోసం గాలింపు చేపట్టారు. కార్లతో విన్యాసాలు చేస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి.

ఎస్‌సి రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలి

- ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమికి బిఆర్‌ఎస్సే కారణం
- పార్టీ ఫిరాయింపులపై కోర్టు తీర్పు శిరసావహిస్తా
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

2011 జనాభా ప్రకారం ఎస్‌సిల జనాభా 18 శాతానికి పెరిగినందున.. ఎస్‌సి రిజర్వేషన్లను 18 శాతానికి పెంచి వర్గీకరణ చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం హన్మకొండ జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కడియం శ్రీహరి మాట్లాడారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు వెలువడిన వెంటనే దేశంలో ముందు స్పందించింది సిఎం రేవంత్‌రెడ్డేనని గుర్తు చేశారు. కాలయాపన చేయకుండా వెంటనే ఎస్‌సి రిజర్వేషన్లను పెంచి వర్గీకరణ అమలు చేయాలన్నారు. 1994లో మొదటిసారి తాను ఎమ్మెల్యేగా గెలిచానని, ఆనాడే వర్గీకరణ ఉద్యమం ప్రారంభమైందన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

30 ఏళ్లుగా ఈ ఉద్యమానికి అన్ని ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతిచ్చాయని తెలిపారు. అయినా వర్గీకరణకు 30 ఏళ్లు పట్టిందన్నారు. మాదిగ, మాదిగ ఉప కులాల పక్షాన సిఎం రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి కడియం శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఓటమికి బిఆర్‌ఎస్సే కారణమని అన్నారు. ఆప్ ఓడిపోయినందుకు బిజెపి కంటే కెటిఆర్ ఎందుకు ఎక్కువ సంతోషపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. నీతివంతమైన పాలన నినాదంతోనే మొదటి సారి అధికారంలోకి వచ్చినప్పుడు ఆప్ పాలన బాగానే ఉందని, రెండో దఫా ఆప్, బిఆర్‌ఎస్‌తో స్నేహం చేసి లిక్కర్ కుంభకోణంలో ఇరుక్కుందని, దాంతో అధికారం కోల్పోవాల్సి వచ్చిందని తెలిపారు. ఆప్, కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తే ఆప్ అధికారంలోకి వచ్చేదని, ఈ విషయంలో రాజకీయ పార్టీలు ఆలోచించుకోవాలన్నారు. పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు బిఆర్‌ఎస్‌కు లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పును శిరసావహిస్తానని తెలిపారు. ఉప ఎన్నికలు వస్తే ఎదుర్కొంటానని, పారిపోయే ప్రసక్తే లేదన్నారు. ఫిరాయింపుల చట్టాన్ని ఉల్లంఘించి పదేళ్లలో 36 మంది ఎమ్మెల్యేలను బిఆర్‌ఎస్ చేర్చుకున్న విషయాన్ని గుర్తు చేశారు. వాళ్లు పార్టీలకు రాజీనామా చేయకున్నా బీఆర్‌ఎస్‌లో చేర్చుకొని మంత్రి పదవులను సైతం ఇచ్చారన్నారు. వ్యవస్థను భ్రష్టు పట్టించిందే బిఆర్‌ఎస్ అని తెలిపారు. వాళ్లు చేస్తే సంసారం, ఇతరులు చేస్తే వ్యభిచారమా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో జనగామ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారజోడు రాంబాబు, రాజేశ్ తదితరులున్నారు.